క్లుప్తంగా

రేపు క్యాంపస్ డ్రైవ్

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఐటీఐ ఆఖరి సంవత్సరం విద్యార్థుల కోసం ఈ నెల 19వ తేదీ గురువారం తమ కళాశాల ఆవరణలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఖాళీలను భర్తీ చేస్తారని తెలిపారు. ఐటీఐ చదివిన వారు విజయవాడ రమేష్ ఆస్పత్రి రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు గురువారం ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 92986 05175 నంబరులో సంప్రదించాల్సిందిగా సూచించారు.

శ్రీవారి సన్నిధిలో అన్నప్రసాద వితరణ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో సుమారు రెండు వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. తొలుత స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ప్రసాదాలకు దాత లక్ష్మి, నవీన్‌కుమార్, దుర్గారావు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారి సన్నిధిలో పలువురు ఉభయదాతలు, ముత్తయిదువులకు ఆలయ కమిటీ ప్రసాద వితరణ చేసింది. అనంతరం కళ్యాణ మండపంలో ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, మరుపిళ్ల సత్యనారాయణ, కొరగంజి భాస్కరరావు, బంక హనుమంతరావు, మజ్జి శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.

వాటర్ పైప్‌లైన్‌కు మరమ్మతులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో అంతర్గత రహదారుల్లోని తాగునీటి పైప్‌లైన్లకు మరమ్మతులు నిర్వహించారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండటానికి పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ ఆదేశాలతో సిబ్బంది మరమ్మతులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి సమస్యలు గుర్తించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామంలో రెండు వాటర్ ట్యాంక్‌లు, డైరెక్టు పంపింగ్, మోటారు బోర్ల సహాయంతో తాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. తాగునీటి సరఫరాలో కాల్వగట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షిస్తున్నామన్నారు. ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నామని, వాటర్ పైప్‌లైన్ లీక్‌లు గుర్తించి మరమ్మతులు చేయిస్తున్నట్లు చెప్పారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

వాహనాల వేగ నిరోధకాలు ఏవీ

- కేదారేశ్వరపేట సెంట్రల్ వేర్ హౌస్ వద్ద నిత్యం ప్రమాదాలు
- భయందోళనలో పిల్లల తల్లిదండ్రులు



సెంట్రల్ వేర్ హౌస్ రోడ్డులో దూసుకు పోతున్న వాహనాలు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): దూసుకుపోతున్న వాహనాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కేదారేశ్వరపేట సెంట్రల్ వేర్‌హౌస్ రోడ్డు నిత్యం ప్రమాదాలకు కేంద్రంగా మారుతోంది. పప్పులమిల్లు సెంటర్ నుంచి పాత మసీదు వరకు ఈ రోడ్డులో స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో వాహనచోదకులు మితిమీరిన వేగంతో దూసుకుపోతున్నారు. గతంలో ఎర్రకట్ట డౌన్ నుంచి సీకే రెడ్డి రోడ్డు వరకు వాహనాల రాకపోకలకు అనువుగా 30 అడుగుల సీసీ రోడ్డు నిర్మించారు. చిట్టినగర్ నుంచి బందరురోడ్డు, ఏలూరురోడ్డు, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్ తదితర ప్రాంతాలకు ఈ రోడ్డు మీదగా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటువంటి రద్దీ రోడ్డులో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్‌బ్రేకర్లు మాత్రం ఏర్పాటుచేయలేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి కారణం మితిమీరిన వేగంతో వాహనాలు నడపడమే కారణమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

కనిపించని స్పీడ్‌బ్రేకర్లు

పప్పుల మిల్లు సెంటర్ జంక్షన్, ఎర్రకట్ట డౌన్ జంక్షన్ల వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఈ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవమే కారణమని వాహనచోదకులు చెబుతున్నారు. ఈ ప్రదేశాల్లో ఏ వాహనం ఎటు నుంచి వస్తుందో, ఎటు వెళ్తుందో తెలియని పరిస్థితి నెలకొంటోంది. ఈ ప్రాంతంలో రోడ్డు మార్జిన్లను ఆక్రమించుకుని పదుల సంఖ్యలో దుకాణాలు వెలిశాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించడం లేదని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ వేర్ హౌస్ వద్ద ఉన్న బార్‌లో మద్యం సేవించిన యువకులు ఇష్టానుసారం వాహనాలను అడ్డదిడ్డంగా, అతివేగంగా నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు మరింత కారణమవుతున్నారు.



ఎర్రకట్ట డౌన్ జంక్షన్‌లో మితిమీరిన వేగంతో వాహనం నడుపుతున్న యువత



పప్పుల మిల్లు సెంటర్ జంక్షన్‌లో అడ్డదిడ్డంగా వాహనాలు

ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని

కేదారేశ్వరపేట ప్రాంతంలో పదుల సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ఉండటంతో తమ పిల్లలు నిత్యం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి వచ్చే క్రమంలో ఎక్కడ ప్రమాదాలకు గురవుతారోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పిల్లలను వారే దగ్గరుండి పాఠశాలలో దింపి, సాయంత్రం ఇంటికి తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

సెంట్రల్ వేర్ హౌస్ రోడ్డులో పప్పులమిల్లు జంక్షన్, ఎర్రకట్ట డౌన్ జంక్షన్లలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇక్కడ ప్రమాదాలను నివారించాలని అనేక సార్లు సంబంధిత అధికారులకు విజ్ఞప్తులు చేసినా పట్టించుకునే దాఖలాలు లేవని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా వారు స్పందించి ఈ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

మర్యాదపూర్వక కలయిక



దొడ్డా రాజశేఖరరెడ్డిని సత్కరిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



జగన్‌మోహన్‌రెడ్డితో గౌస్‌మొహిద్దీన్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఐటీ విభాగం జాయింట్ సెక్రటరీగా ఇటీవల నియమితులైన భవానీపురానికి చెందిన దొడ్డా రాజశేఖరరెడ్డి మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన రాజశేఖరరెడ్డిని శాలువా కప్పి సత్కరించారు. వక్ఫ్ బోర్డ్ జిల్లా మాజీ చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ వేరుగా జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

– భవానీపురం, విజయవాడపశ్చిమ

వినూత్న విధానాలతో గాలి నాణ్యతను పెంచుదాం

కలెక్టర్ జి.లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కాలుష్య రహిత సమాజానికి మనం పీల్చే గాలి స్వచ్ఛంగా ఉండటం కీలకమని.. వినూత్న విధానాలతో విజయవాడ నగరం వాయు కాలుష్యం బారిన పడకుండా చేసేందుకు సమష్టి కృషి అవసరమని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జాతీయ శుద్ధ వాయు కార్యక్రమం (ఎన్‌సీఏపీ) అమలుపై సమీక్షించడానికి విజయవాడ నగర ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం జరిగింది. కాలుష్య నియంత్రణ, విజయవాడ నగరపాలక సంస్థ, రవాణా, పరిశ్రమలు తదితర శాఖలు వాయు నాణ్యతను పెంచేందుకు చేపట్టిన పనులు, వాటిలో పురోగతిపై సమీక్షించారు. భవిష్యత్ కార్యాచరణకు మార్గనిర్దేశం చేశారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ నగరం నలువైపులా హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్ల డేటాను ఎప్పటికప్పుడు విశ్లేషించాలన్నారు. దుమ్మూధూళి వ్యాపించకుండా, గాలిలో పీఎం10 సూక్ష్మ ధూళికణాలను లక్ష్యాల మేరకు తగ్గించే కార్యక్రమాలు పటిష్టంగా అమలయ్యేలా చూడాలన్నారు. కాలుష్య రహిత ప్రయాణానికి వీలుకల్పించేలా రహదారుల నిర్మాణం, పేవ్‌మెంట్ రహదారుల ఏర్పాటు, హరిత విస్తీర్ణం పెంపు, మెకానికల్ స్వీపర్ల వినియోగం, ఘన వ్యర్థాల నిర్వహణ, కాలువ గట్ల హరిత సుందరీకరణ వంటి చర్యలను ముమ్మరం చేయాలన్నారు. రూ.5 కోట్లతో చేపట్టిన ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐటీఎంఎస్) పనులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బ్యాటరీ వాహనాలతో పాటు పెద్దఎత్తున విద్యుత్, సోలార్ ఈ–రిక్షాలను ప్రోత్సహించాలన్నారు. నగరాన్ని ఆదర్శవంతంగా నిలిపేలా ఆక్సిజన్ పార్కు అభివృద్ధికి చొరవ చూపాలన్నారు. కాలుష్య కారకాలను వెదజల్లే వాహనాలను గుర్తించి, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో వీటీపీఎస్ బూడిద, ఇతర కాలుష్య కారకాలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జెన్‌కో అధికారులకు కలెక్టర్ సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి అడ్డుకట్టవేయాలన్నారు. జూలై 4న ఎయిర్ క్లీన్ ప్రోగ్రామ్‌పై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పీసీబీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.శ్రీనివాస్, డీసీపీ ఎం.కృష్ణమూర్తి నాయుడు, వీఎంసీ సూపరింటెండింగ్ ఇంజినీర్ (ప్రాజెక్టులు) పి.సత్యకుమారి, ఏపీఐఐసీ జెడ్ఎం కె.బాబ్జి, వీటీపీఎస్ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, ఆర్‌టీవో ఆర్.ప్రవీణ్, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, డీఎస్‌వో ఎ.పాపారావు, డీఏవో డీఎంఎఫ్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాపాయం నుంచి కాపాడేది రక్తదానమే

రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ వెలగా జోషి



రక్తదాన శిబిరంలో జోషి, వాసు, ఎస్‌బీఐ సిబ్బంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): మనిషిని ప్రాణాపాయ పరిస్థితి నుంచి కాపాడేది రక్తదానమేనని రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ వెలగా జోషి పేర్కొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఏర్పడి 70 ఏళ్లు అయిన సందర్భంగా గొల్లపూడి బ్రాంచిలో మంగళవారం రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్‌బీఐ గొల్లపూడి బ్రాంచి రీజనల్ మేనేజర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో వెలగా జోషి మాట్లాడుతూ రక్తదానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, యువతను రక్తదానంపై చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గొల్లపూడి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్రా వాసు మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం మంచిదని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మదన్‌మోహన్, రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ చిట్టిబాబు, ఎస్‌బీఐ సిబ్బంది పాల్గొన్నారు.

తగిన జాగ్రత్తలతో టీబీ నివారణ



వించిపేట(విజయవాడపశ్చిమ): వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకుంటే టీబీని నియంత్రించవచ్చని షేక్ రాజాసాహెబ్ జనరల్ హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శివప్రసాద్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి టీబీ ముక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం హాస్పటల్ ప్రాంగణంలోని టీబీ యూనిట్‌లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ నియంత్రణ చర్యల్లో భాగంగా తొలిసారిగా సైటీబీ ఇంజక్షన్‌లను చేయించామన్నారు. టీబీ బాధిత కుటుంబ సభ్యులకు, మధుమేహ పీడితులకు ఈ ఇంజెక్షన్ చేసి టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం టీబీ చికిత్స విధానాన్ని వివరించారు. వైద్యులు, వైద్య సిబ్బంది, కొత్తపేట టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

'డ్రంక్ అండ్ డ్రైవ్' నిందితులకు జైలు, జరిమానా

సత్యనారాయణపురం: ఇటీవల నగరంలోని మూడవ ట్రాఫిక్ పోలీసులు సత్యనారాయణపురం పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.కిషోర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న యాభై మందిని అదుపులోకి తీసుకుని వారి వాహనాలను సీజ్ చేశారు. మంగళవారం నిందితులను కోర్టులో హాజరుపర్చగా అందులో 47 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.4.70 లక్షలు జరిమానా విధించారు. జరిమానా కట్టని ముగ్గురికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ రైల్వే కోర్టు న్యాయమూర్తి ఆర్.వి.శర్మ తీర్పు వెల్లడించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు మాట్లాడుతూ వాహనచోదకులు ఈ తీర్పును ఒక హెచ్చరికలా తీసుకుని మద్యం సేవించి వాహనాలను నడపడం మానుకోవాలన్నారు. ఇటువంటివి కేవలం ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడమే కాదని, అది ప్రాణాంతకమైన నేరంగా పరిగణిస్తారన్నారు. రోడ్లపై ప్రయాణించే అమాయకుల ప్రాణాలను కూడా ప్రమాదంలో నెట్టే తీవ్రమైన చర్య అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కార్మిక హక్కుల రక్షణకు పోరాటం



సీపీసీ కంపెనీ మేనేజర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు, కార్మికులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జులై 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొనేందుకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్, మండల కార్యదర్శి ఎం.మహేష్‌తో కలిసి సీపీసీ కంపెనీ కార్మికులు సంస్థ మేనేజర్ పిళ్లైకు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలు రద్దు చేసి లేబర్ కోడ్స్ ప్రవేశ పెట్టడం వల్ల కార్మికులు హక్కులు కోల్పోతున్నారన్నారు. హక్కుల రక్షణ కోసం పోరాటంలో భాగంగా సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని చెప్పారు. సీపీసీ కార్మిక యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కాంతారావు, సాంబశివరావు, కోశాధికారి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వాస్పత్రి సైకియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ రాఘవరావు అన్నారు. జూన్ 26.. మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వాస్పత్రిలోని డి ఎడిక్షన్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందితో కలిసి మత్తు పదార్థాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. అనంతరం డాక్టర్ రాఘవరావు మాదకద్రవ్యాల వినియోగం, వాటి వలన కలిగే దుష్పరిణామాలు, చికిత్సపై ప్రజలు, రోగులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ శోభ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తారా, డాక్టర్ రామ్‌నరేష్‌రెడ్డి, డాక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

నగరంలో 'మా రాముడు అందరివాడు' షూటింగ్

26న ట్రైలర్ విడుదల



మాట్లాడుతున్న సినీనటుడు సుమన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో 'మా రాముడు అందరివాడు' చిత్ర షూటింగ్ సన్నివేశాలు మంగళవారం చిత్రీకరించారు. హనుమాన్ పేట లోని ఆలపాటి రామారావు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన చిత్రీకరణలో ముఖ్యమంత్రి పాత్రలో హీరో సుమన్, ఎమ్మెల్యే, గ్రామస్తుల మధ్య జరిగే సంభాషణను చిత్రీకరించారు. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను వెల్లడించేందుకు చిత్ర యూనిట్ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసింది. హీరో సుమన్ మాట్లాడుతూ దర్శకుడు మైఖేల్ కథ తెలిపిన వెంటనే నటించడానికి అంగీకరించినట్లు తెలిపారు. చిన్న చిత్రాలలో మంచి కథాంశం, ప్రఖ్యాత సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారన్నారు. సినీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తే మరింతగా చిత్ర పరిశ్రమ రాష్ట్రంలో అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం హీరో శ్రీరామ్ మాట్లాడుతూ జూన్ 26వ తేదీన 'మా రాముడు అందరివాడు' చిత్ర ట్రైలర్‌ను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. చిత్ర దర్శకుడు మైఖేల్ మాట్లాడుతూ పూర్తిస్థాయి గ్రామీణ నేపథ్యమున్న చిత్రాన్ని అద్భుతంగా తీస్తున్నట్లు తెలిపారు. ఈ సినిమాలో హీరో సుమన్ ముఖ్యమంత్రి పాత్రలో నటిస్తున్నారన్నారు. చిత్ర నిర్మాత అనుముల లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అవినీతి ఆక్రమాలపై నిలదీసే సన్నివేశాలు ఈ చిత్రంలో నిజ జీవితానికి దగ్గరగా ఉండేలా చిత్ర నిర్మాణం జరుగుతున్నట్లు తెలిపారు.

చరిత్ర ఘనం.. వర్తమానం భారం!

- మూతబడిన అల్లూరి సీతారామరాజు గ్రంథాలయం
- స్వాతంత్ర్యానికి ముందు స్థాపన
- నిర్వహణ భారంతో మూసివేత
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు



విద్యాధరపురం మర్రిచెట్టు సెంటర్‌లో గ్రంథాలయ భవనం



గ్రంథాలయ భవనం వెనుక మూడు షాపులు



భవన నిర్మాణ సమయంలో శిలాఫలకం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని అల్లూరి సీతారామరాజు గ్రంథాలయ చరిత్ర నాడు ఘనం.. వర్తమానంలో భారంగా మారింది. స్వాతంత్ర్యోద్యమంలో అక్షరాన్ని ఆయుధంగా మలిచి సామాన్యులకు సైతం ప్రేరణ కలిగించిన విద్యాధరపురం చెరువు సెంటర్ లోపల మర్రిచెట్టు సెంటర్ (రామరాజ్యనగర్)లోని శ్రీఅల్లూరి సీతారామరాజు గ్రంథాలయం నిర్వహణ భారంతో మూతపడటంపై పాఠకులు ఆందోళన చెందుతున్నారు. స్వాతంత్ర్యం రాకముందే 1946లో స్థానికులు స్థాపించిన వీవీ రాజు స్మారక శ్రీఅల్లూరి సీతారామరాజు గ్రంథాలయ చరిత్ర ఎంతో ఘనం. ప్రస్తుతం ఓవైపు నిర్వహణ భారం. మరో వైపు ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. నాడు స్వాతంత్ర్య సాధనకు వీరోచితంగా పోరాడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరుతో రామరాజ్యనగర్ గ్రామ కమిటీ ఏర్పాటు చేసిన గ్రంథాలయం పరిస్థితి ఇప్పుడు దయనీయంగా మారింది.

ప్రారంభకుడు సినారె

గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసిన స్థానిక పెద్దలు కొన్నేళ్లపాటు వారి ఇళ్లల్లోనే నడిపారు. ఐదు దశాబ్దాల తర్వాత 1996లో స్థానిక పెద్దలు ఉప్పలపాటి రామచంద్రరాజు సౌజన్యంతో కుండనాల భాస్కరరావు, ఉప్పలపాటి సాంబశివరాజు ప్రధానకార్యదర్శి, అధ్యక్షులుగా ఏర్పడిన కమిటీ గ్రంథాలయానికి చిన్న భవనాన్ని నిర్మించింది. ఆ గ్రంథాలయాన్ని పద్మభూషణ్, జ్ఞానపీఠ అవార్డ్‌గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి (సినారె) ప్రారంభించారు. అప్పటికి పశ్చిమ నియోజకవర్గంలో అదొక్కటే ప్రైవేట్ లైబ్రరీ. కమిటీ నిర్వహణలో గ్రంథాలయం ఎంతో మందికి స్ఫూర్తినిచ్చింది.

ట్యాక్స్‌లతో నిర్వహణ భారం

మర్రిచెట్టు వద్ద నిర్మించిన చిన్నపాటి భవనం వెనుకవైపు మూడు చిన్నచిన్న షాపులు వచ్చాయి. వారిచ్చే కొద్దిపాటి అద్దెలతో ఒక గుమస్తాను నియమించుకుని నడుపుతున్నారు. దాతల సహకారంతో సుమారు నాలుగు వేల పుస్తకాలు లైబ్రరీలో ఉన్నాయి. అలాగే నాలుగైదు దినపత్రికలూ వచ్చేవి. ప్రతి రోజూ స్థానికులు సుమారు 25 మంది వస్తుండేవారు. ఈ నేపథ్యంలో చెల్లాచెదురైన కమిటీ సభ్యుల్లో ఒకరు సుమారు 15 ఏళ్ల క్రితం స్థానికుడైన జింకా చక్రధర్ అనే వ్యక్తిని సెక్రటరీగా నియమించి గ్రంథాలయ నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. నాటి నుంచి ఇప్పటి వరకు లైబ్రరీ బాగోగులు చూసుకుంటున్న ఆయనకు ఐదేళ్ల క్రితం నగరపాలక సంస్థ విధించిన పన్ను పోటు తగిలింది. ఒకేసారి సుమారు రూ.28 వేలు ట్యాక్స్ చెల్లించాలని డిమాండ్ నోటీస్ రావడంతో ఆయన హతాశుడై ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగి గ్రంథాలయానికి పన్ను విధించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. గ్రంథాలయం వెనుక మూడు షాపులు ఉండటంతో కమర్షియల్‌గా భావించి పన్ను వేశామని అధికారులు స్పష్టం చేశారు. కనీసం మూడు షాపుల వరకు పన్ను వేసి గ్రంథాలయ భవనాన్ని వదిలేయాలని ప్రాథేయపడ్డా ప్రయోజనం లేకుండా పోయింది. దాంతో దాదాపు నెల రోజుల నుంచి ఎనిమిది దశాబ్దాల ఘన చరిత్ర కలిగిన అల్లూరి సీతారామరాజు గ్రంథాలయం మూతపడింది.

ముందుకొస్తే నిర్వహణ బాధ్యతలను అప్పగించేస్తా



గ్రంథాలయ భవనం వెనుక ఉన్న మూడు దుకాణాల యజమానులు అద్దెలు సక్రమంగా చెల్లించడం లేదు. మరో పక్క దినపత్రికలు వేయించే దాతలూ కరువయ్యారు. గుమస్తాకు జీతం ఇచ్చే పరిస్థితి కనపడటంలేదు. ఇంకో వైపు భవనం ట్యాక్స్‌ల భారం ఎక్కువైపోయింది. అక్కడికీ కొంత మేర నా సొంత డబ్బే ఖర్చు పెడుతున్నాను. ఈ క్రమంలో ఆరోగ్య పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో ఎక్కువగా తిరగలేక పోతున్నాను. పూర్వపు కమిటీ సభ్యులెవరూ కనబడని పరిస్థితి. ఎవరైనా ముందుకువస్తే గ్రంథాలయ నిర్వహణ బాధ్యతలను అప్పగించడానికి సిద్ధంగా ఉన్నాను.

– జింకా చక్రధర్, సెక్రటరీ, అల్లూరి సీతారామరాజు గ్రంథాలయం.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం రామరాజ్యనగర్ సెక్షన్ 33/11 కేవీ కబేళా విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ లలితానగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులతోపాటు నిర్వహణ నిమిత్తం కొన్ని ప్రాంతాల్లో మూడు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు లలితానగర్, పోలీస్ కాలనీ, నూర్ మసీదు రోడ్, రైతుబజార్ రోడ్, టెలిఫోన్ కాలనీ, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్ తదితర ఏరియాల్లో కరెంట్ నిలిపి వేయనున్నట్లు వివరించారు.

వ్యక్తిపై దాడి

పెనమలూరు: కానూరులో ఓ వ్యక్తిపై పలువురు దాడి చేయటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం కానూరు కృష్ణనగర్‌కు చెందిన షేక్ బాషా తన కుమారుడి వివాహానికి మాంసం కోసం హుస్సేన్ అనే వ్యక్తికి రూ.2.37 లక్షలు ఇచ్చాడు. మాంసం తాలుకా ఇంకా బాషా రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా అతను సకాలంలో డబ్బు ఇవ్వలేదు. కొన్ని వాయిదాల తరువాత రూ.34 వేలు ఇచ్చాడు. మిగితా రూ.6 వేలు ఇవ్వలేదు. దీనిపై వివాదం తలెత్తడంతో బాషాపై హుస్సేన్ మరో నలుగురు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చిట్టీల పేరుతో మోసం

కృష్ణలంక పీఎస్‌లో ఫిర్యాదు

కృష్ణలంక(విజయవాడతూర్పు): చిట్టీల పేరుతో డబ్బులు కట్టించుకుని మోసం చేసిన ఘటనపై పలువురు మహిళలు కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణలంక 21వ డివిజన్‌కు చెందిన పేరం వెంకటనర్సమ్మ(చిన్ని) కొన్నేళ్లుగా ప్రైవేట్ చిట్టీ వ్యాపారం నిర్వహిస్తోంది. 21, 22 డివిజన్లకు చెందిన ధనలక్ష్మి, వెంకాయమ్మ, లావణ్య, వారితో పాటు మరికొందరు మహిళలు రూ.లక్ష, రూ.60వేలు చిట్టీలు ఆమె వద్ద వేశారు. కాలపరిమితి ముగిసినా చిట్టీ డబ్బులు ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు నిర్ధారించుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా తన వద్ద చిట్టీలు వేసి వారే పాడుకుని కట్టకుండా మోసం చేశారని, తనకే డబ్బులు ఇవ్వాలని చిన్ని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇరువురి ఫిర్యాదులను స్వీకరించి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.